మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

ఈ నెల 8 నుంచి 23 వరకు జిల్లాలో

## సిటీ పోలీసు యాక్ట్ అమలు : సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 8 నుంచి 23 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, రాల్యీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. బందల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి బెదిరింపులకు గురి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. నిబంధలను ఉల్లంఘించి డిజె వినియోగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ప్రజాప్రతినిధులు మాలల సమస్యలపై మాట్లాడాలి

-మాల సంఘాల జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్

**గజ్వేల్, జనవరి 6 (ప్రభాతవార్త):** మాల ప్రజాప్రతినిధులు మాలల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని మాల సంఘాల జేఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాల ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనవారు మాల సమస్యలపై నోరు విప్పాలని, మీకు అండగా మేముంటామన్నారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ చట్టం వల్ల మాల సామాజిక వర్గానికి జరుగుతున్న నష్టం, రోస్టర్ విధానంలోని లోపాలపై చర్చించాలని కోరుతూ సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించేందుకు వెళ్తుండగా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. జేఏసి నాయకులపై దాడులు చేసి గాయపరిచి అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మాల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న అన్యాయాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మాల సామాజిక వర్గ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని, మాలల హక్కుల కోసం పోరాటం ఆపేదిలేదని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావిణ్య

## అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 6, ప్రభాతవార్త :** రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నియమించబడిన నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంబంధిత నోడల్ అధికారులు ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో ముందుగానే సిద్ధంగా ఉండాలన్నారు. తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని, ఎక్కడా అలసత్వానికి తావివ్వకూడదని తెలిపారు. నోడల్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలను క్షుణ్ణంగా చదివి అవగాహన పెంచుకోవాలని, చిన్న తప్పిదం జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని, శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 6 ప్రభాతవార్త:** అట్రాసిటీ కేసులు, పోలీస్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలను సత్వరంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ కింద వివిధ శాఖల ద్వారా వెచ్చిస్తున్న నిధులు, తదితర అంశాలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. పదోన్నతుల్లో, రోస్టర్ అమలులో ఎస్సీ,ఎస్టీలకు అన్యాయం జరిగితే సహించబోమని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులైన పేదలకు చేరేలా ప్రత్యేక దృష్టి తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు చెల్లించాల్సిన పెండింగ్ నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని, అలాగే కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహకం, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద కావలసిన నిధులకు ప్రతిపాదనలు పంపితే మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, గోదాము, మహిళా భవనం, పాఠశాల కాంపౌండ్ నిర్మాణాలకు మంజూరులు పొందాలని సూచించారు. జిల్లాలో నిధులు అందుబాటులో ఉన్నందున మంజూరులు తీసుకో వలసిన బాధ్యత ఎంపీడీవోలదని పేర్కొన్నారు. అనంతరం పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన పది మంది ఎస్సీ రైతులకు డ్రాఫ్ట్ పాస్‌బుక్‌లను అందజేశారు. పలువురు ఎస్సీ, ఎస్టీలు తమ సమస్యలపై అందజేసిన ఫిర్యాదులను స్వీకరించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, అదనపు ఎస్పీ రఘునందన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, డీఎస్పీలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఆదిత్య

**హుస్నాబాద్ రూరల్, జనవరి 6, ప్రభాతవార్త :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలు మూడు రోజులుగా హైదరాబాద్‌లో జరిగాయి. ఈ మహాసభలలో రాష్ట్ర స్థితిగతులు, విద్యా రంగా సమస్యలు, సంక్షేమ గురుకుల హాస్టల్‌ల స్థితిగతులపై చర్చించి విద్యారంగా సమస్యల పరిష్కారానికై రాబోవు కార్యక్రమాలను రూపకల్పన చేస్తూ తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో భాగంగా సావుల ఆదిత్య స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నికయ్యారు. హుస్నాబాద్‌కు చెందిన సావుల ఆదిత్య కార్యకర్త స్థాయి నుండి రాష్ట్ర కమిటీలో చోటు దక్కడం సంతోషకరంగా ఉందని, విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందించడానికై సమాజ సేవకై అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు తెలిపారు.

## చదువుతోనే సమాజాభివృద్ధి

సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అకుల భద్రప్ప

**కొండపాక, జనవరి 6, ప్రభాతవార్త :** చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుంతుందని సర్పంచుల ఫోరం కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు అకుల భద్రప్ప అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈఒ బచ్చలి సత్తయ్య, ఉపాధ్యాయుల సహకరంతో స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాలలో ఎమైన సమస్యలుంటే తమ పాలకవర్గం తీర్చడానికి ప్రయత్నిస్తుందన్నారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్య అందుతుందన్నారు. ఎంఈఒ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులందరు బాధ్యతగా పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు పంచాయతి పాలకవర్గన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి మమత, వార్డు సభ్యులు కనకరాజు, భారతమ్మ, రాజమణి, రాజు, సురేష్ గౌడ్, బాబు, చంద్రకళ హెచ్‌ఎం చిల రవి, ఎఐపిసి చైర్ పర్సన్ రేణుక, ఉప సర్పంచ్, ఈసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో టెన్త్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను ప్రత్యేకంగా చదివించాలని సిద్దిపవేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వపాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల హెచ్‌ఎంలు టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మూడేళ్ల నుంచి టెన్త్ ఫలితాలలో జిల్లా ఉన్నత స్థానాలను సాధిస్తూ ఆదర్శంగా నిలిచిందని, అదేమాదిరిగా ఈ ఏడు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రకారం విద్యార్థులను చదివించాలన్నారు. ఈ నెల 7 నుంచి ప్రతిపాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి వీక్ ఉన్న సబ్జెక్టులలో ఖచ్చితంగా ఉత్తీర్ణత అయ్యేలా ప్రత్యేకంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యార్థులచే బట్టి పట్టించకుండా సబ్జెక్ట్ అర్థమయ్యేలా బోధించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెన్త్ చదువుతున్న ఇప్పటికీ సరిగా చదవడం రాయడం రాని విద్యార్థులు ఉండడం దురదృష్టకమన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థుల ప్రత్యేక అభ్యాసన ప్రణాళిక బుక్లెట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవోలు, హాస్టల్ వార్డెన్లు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను తెలపాలి...

ఓటర్ జాబితాలో అభ్యంతరాలను తెలపాలని గుర్తింపు రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. పురపాలక ఎన్నికలు త్వరలో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని హుస్నాబాద్, దుబ్బాక,చేర్యాల, ప్రజ్ఞాపూర్-గజ్వేల్ మున్సిపాలిటీలలో త్వరలో సాధారణఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా మున్సిపల్ వార్డులలో ఓటర్ జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. ఓటర్ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలిపితే ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ నెల 10న చివరి ఓటర్ జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మున్సిపల్ కమిషనర్లు మల్లికార్జున్, రమేష్‌కుమార్, నాగేంద్ర, బాల కృష్ణ, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పవన్

ప్రజ్ఞాపూర్-గజ్వేల్ మున్సిపాలిటీని

## 35 వార్డులుగా విభజించాలి

**సిద్దిపేట అర్బన్, జనవరిర 6, ప్రభాతవార్త :** ప్రజ్ఞాపూర్-గజ్వేల్ మున్సిపల్‌లోగల 20 వార్డులను 35 వార్డులుగా విభజించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హైమావతిని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజ్ఞాపూర్-గజ్వేల్ మున్సిపల్‌లో 45 వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయని, కేవలం 20 వార్డులు ఉండడం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదని దీంతో పరిపాలనలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఒక్కొక్క వార్డులో 2800 ఓట్లు వరకు ఉన్నాయని పోటీ చేసే అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. మల్లన్నసాగర్ ముంపుకు గురైన గ్రామాలను కలుపుకొని ఏర్పడిన కాలనీలో కొన్ని వార్డులను చేయాలని గజ్వేల్‌లో మరొక రెండు వార్డులను పెంచాలన్నారు. మున్సిపాలిటీలో 20 నుంచి 35 వార్డులకు విభజించి ప్రజలకు మేలు చేయాలన్నారు. ఓట్లను సరిచేయడంలో తప్పులు జరిగాయని చనిపోయిన వారి పేర్లు తొలగించలేదని కొంత మందికి డబుల్ ఓట్లు కలిగి ఉన్నారని వెంటనే వాటిని తొలగించి తప్పులను సరిచేయాలన్నారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్దన్ తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుపుతున్న గజ్వేల్ ఏసిపి నరసింహులు

## అంతర్ జిల్లా కేబుల్ దొంగల ముఠా అరెస్ట్

రూ.2.80 లక్షల సొత్తు స్వాధీనం

**రాయపోల్, జనవరి 6(ప్రభాతవార్త):** సిద్దిపేట, మెదక్, మేడ్చల్ జిల్లాల్లో జరిగిన 12 వరుస కాపర్ వైర్ చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు గజ్వేల్ ఏసిపి నరసింహులు తెలిపారు. మంగళవారం రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసిపి నరసింహులు వివరాలు తెలిపారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని కుకునూర్‌పల్లి, రాయపోల్, తొగుట పోలీస్‌స్టేషన్లలో 10 కేసులు, మెదక్ జిల్లా చేగుంటలో 1, మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో 1 కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసుల్లో అరెస్టయిన నిందితులు రాయపోల్ మండలం వీరానగర్‌కు చెందిన పిట్ల ధనుష్(20), ఒంక మహిపాల్(21), రాంసాగర్‌కు చెందిన మొహమ్మద్ ఇర్ఫాన్(19), గజ్వేల్‌కు చెందిన సత్తు వంశీ(22), గజ్వేల్ మండలం అక్కారంకు చెందిన దూదేకుల సల్మాన్‌ఖాన్(19)తోపాటు దొంగసొత్తు కొనుగోలు చేసిన మల్లేశం, మల్లప్ప, బీరప్పలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు చిల్లప్ప పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులు రైతుల వ్యవసాయ భూముల్లోని బోర్‌మోటార్ కేబుల్ వైర్లను రాత్రివేళ చోరీకి పాల్పడి వాటిని నిర్మానుష్య ప్రాంతాల్లో కాల్చి కాపర్‌వైర్‌ను వేరుచేసి స్క్రాప్ షాపులకు విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. అంకిరెడ్డిపల్లి గ్రామ శివారులోని గుర్రాలసోఫా వద్ద వాహన తనిఖీలో నిందితులను పట్టుకుని, వారి వద్ద నుండి రూ.70వేల విలువైన 90 కిలోల కాపర్ వైర్‌తో పాటు దొంగతనానికి ఉపయోగించిన మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.2.80 లక్షలు ఉంటుందన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్‌ఎం.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో గజ్వేల్ ఏసిపి నరసింహులు, తొగుట సిఐ ఎస్‌కె.లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు.

### అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

**కొండపాక, జనవరి 6, ప్రభాతవార్త :** అనుమానాస్పదస్థితిలో ఒక మహిళ మృతి చెందిన సంఘటన తిమ్మారెడ్డిపల్లి మధిర సార్లవాడలో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... ఎలూరి రాములమ్మ(60) ఇంటిలో అనుమానాస్పదంగా మృతి చెందిందని తెలిపారు. సంఘటన స్థలానికి తొగుట సిఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై పండుగ శ్రీనివాస్ చేరుకొని మృతికిగల కారణాలను పరిశీలిస్తున్నారు. మృతురాలు హోటల్ నడపుకుంటూ జీవనం సాగిస్తుండేదని, భర్త కొంత కాలం క్రితం మృతి చెందగా ప్రస్తుతం ఆమె ఒక్కతే ఇంట్లో ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యుకువడి మృతి

**కంది, జనవరి 6, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందిన సంఘటన కంది-శంకర్‌పల్లి బెంగళూరు బైపాస్ రోడ్డుపై ఎద్దుమైలారం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జరిగింది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... మండల పరిధిలోని జులుకల్ గ్రామానికి చెందిన పట్నం ప్రవీణ్(28) సోమవారం సాయంత్రం బంధువు పట్నం మల్లేష్ (45)తో కలిసి ద్విచక్ర వాహనం (టిఎస్ 15 ఈఎం 5540 ఫ్యాషన్ ప్రో)పై జులుకల్ నుంచి శంకర్‌పల్లి వెళుతున్న తరుణంలో మంజీర పైప్‌లైన్ దాటగానే అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీన్ తలకు, ముఖానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. వాహనంపై ప్రయాణిస్తున్న పట్నం మల్లేష్ తలకు, ముఖానికి గాయలు కావడంతో శంకర్‌పల్లిలోని విజయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుని సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ వివరించారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

**హుస్నాబాద్ రూరల్, జనవరి 6, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే...మంగళవారం అలుమల్ల రాజిరెడ్డి(72) హుస్నాబాద్ నుంచి పందిల్ల గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన వరంగల్ 1డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెంబర్ టిఎస్ 03 జెడ్ 0374 ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రాజిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన రాజిరెడ్డి తల పగిలి, ప్రాణాపాయ స్థితిలో ఉంటే సహాయం చేయాల్సిన తోటిప్రజలు సెల్‌ఫోన్‌లలో వీడియోలు, ఫొటోలు తీసుకున్నారు. అయితే విషయం తెలుసుకున్న సర్పంచ్ తోడేటి రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని సొంత వాహనంలో వ్యక్తిని ఎక్కించుకొని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్‌కూ రమేష్ తన సొంత వాహనంలోనే తరలించి మానవత్వం ఇంకా బతికే ఉందని చాటిచెప్పారు. అయినా వ్యక్తి మృతి చెందటం పట్ల గ్రామంలో విశాద చాయలు అలుముకున్నాయి.



మాట్లాడుతున్న హరీష్‌రావు

## కాంగ్రెస్ పాలనలో మురికికూపాలుగా మారిన గ్రామాలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** బిఆర్‌ఎస్‌పాలనలో అప్పటి సిఎం కెసిఆర్ గ్రామాలను ముత్యంలా తీర్చిదిద్దితే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల పాలనలో మురికి కూపాలుగా మారాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి సంఘంలో మంగళవారం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి రెండేళ్ల నుంచి పంచాయతీ ఎన్నికలు పెట్టలేదు పల్లెల అభివృద్ధికి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రాబోయే రెండేళ్లలో తిరిగి బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చితీరు తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి హైదారాబాద్‌లో కూర్చుని కాళేశ్వరం కూలిందంటున్నారు.. కాళేశ్వరమే కూలితే రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఝూఠమాటలు మాట్లడడంలో నంబర్‌వన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలనలో పేరుకుపోయిన చెత్త,చెదారం, దుమ్ము, ధూళీ తీయాల్సిన బాధ్యత నూతన సర్పంచ్‌లపై ఉందన్నారు. పదవి అనేది ఓ బాధ్యత అని ప్రజలకు సేవచేసి మంచి పేరు తెచ్చు కొని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీని వాస్, మాజీ ఎమ్మెల్యే ఫారూఖ్ హుస్సేన్, పార్టీ నాయకులు మాట్లాడారు. అనంతరం నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుండు భూపేష్, రాధాకృష్ణశర్మ, మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దేవులపల్లి మహేందర్

**గజ్వేల్, జనవరి 6 (ప్రభాతవార్త):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దేవులపల్లి మహేందర్‌ను నియమించారు. శంషాబాద్‌లో మూడు రోజులుగా ఎబివిపి 44వ రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరిగింది. మహాసభలలో గజ్వేల్‌కు చెందిన దేవులపల్లి మహేందర్‌ను రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా నియమించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా అవకాశం కల్పించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్రాంతి అనంతరం అందుబాటులోకి

## నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సేవలు

**పటాన్‌చెరు, జనవరి 6 ప్రభాతవార్త :** సంక్రాంతి అనంతరం పటాన్‌చెరు కేంద్రంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయనున్న పాత తహసీల్దార్ కార్యాలయాన్ని ఉమ్మడిజిల్లా రిజిస్ట్రార్ వల్లి సుబ్బలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. శాశ్వత భవనం నిర్మించే వరకు తాత్కాలికంగా ఈ భవనంలోనే కార్యాలయం కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు సమకూరుస్తున్నామని తెలిపారు. శాశ్వత భవనం ఏర్పాటు కోసం అతి త్వరలో భూ కేటాయింపులు జరగనున్నాయని తెలిపారు. స్థల పరిశీలనలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఐదు ఎకరాల సువిశాల విస్తీర్ణంలో శాశ్వత భవనం నిర్మిస్తామని తెలిపారు. జనవరి 20వ తేదీ లోపు కార్యాలయం సేవలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు సబ్ రిజిస్ట్రార్ సురేందర్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

# టేక్మాల్‌లో ఇటుక బట్టీలు ఫుల్.. అనుమతులు నిల్..!

* గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు * వాల్టా చట్టన్ని తుంగలో తొక్కుతున్న వైనం * పట్టించుకోని అధికారులు

**టేక్మాల్, జనవరి 6, ప్రభాతవార్త:** వాల్టా చట్టాన్ని అక్రమ వ్యాపారుల చుట్టంగా మార్చుకొని అడిగే నాథుడెవరూ లేరనే ధైర్యంతో ఇటుక బట్టీలను నిలిపి ఇటుక బట్టీల వ్యాపారంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నారటంలో సందేహంలేదు. టేక్మాల్ మండలంలో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. మండల పరిధిలోని సర్మాన్‌కుంట, సాలోజిపల్లి, కాదులూరు, ఎల్లంపల్లి, టేక్మాల్, తంప్లూరు, పోగులవెంకటాపూర్,ఎల్లుపేట, సూరంపల్లి, వేల్పుగొండ, ఎక్లాస్‌పూర్, షాబాద్‌తండా, మెరుగున్ కుంట, అశింపల్లిలతోపాటు ఆయా గ్రామాల్లో కొందరు నాయకులు, అధికారుల అండదండలతో మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. కొందరు వ్యాపారులు నిబంధనలను పక్కన బెట్టి ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు లేకుండానే అడ్డగోలుగా ఇటుక బట్టీలను నెలకొల్పుతున్నారు. అంతేకాకుండా వ్యవసాయ బావులు, బోర్ల నుంచి ఇటుక బట్టీల తయారికి కావాల్సిన నీటిని వినియోగించుకుంటూ విద్యుత్‌ను ఉచితంగా వాడుకుంటూ విద్యుత్ ఆదాయానికి గండికొడుతున్నారు. వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలను నెలకొల్పాలంటే దానిని వ్యవసాయేతర భూమిగా మార్చటంతోపాటు, రెవెన్యూ, భూగర్భ జలాలు, అటవీ, కాలుష్య నియంత్రణ, పంచాయతిరాజ్, తదితర శాఖల నుంచి అనుమతి పత్రాలను పొంది ఉండాలి.

ఇలాంటి అనుమతి పత్రాలన్ని పూర్తిస్థాయి లో లేకుండానే కొందరి నాయకులు, అధికారుల అందదండలతో అక్రమంగా నెలకొల్పుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడమే కాకుండా, వ్యవసాయ చెరువులను, భూములను విధ్వంసం చేస్తూ, బట్టీలను కాల్చటానికి అక్రమ కలపను వినియోగిస్తూ పర్యావరణాన్ని పాడుచేస్తున్నారు.

రాత్రివేళల్లో పెద్దపెద్ద మంటలు, పొగలు వస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారుల జాడేలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ అనుమతులు తీసుకున్నా బట్టి కెపాసిటీని బట్టి గనుల శాఖకు ఎంత డబ్బు చెల్లించాలి, ఒక క్యూబిక్ మీటర్ మట్టికి ప్రభుత్వానికి ఎంత చెల్లించాలనే నిబంధనలు పాటించకుండానే పెద్ద పెద్ద బట్టీలను నిర్వహిస్తున్నారు. చెరువుల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంవల్ల చేపల వేటకు వెళ్లే ముదిరాజ్‌లకు ప్రమాదాలు పొంచి ఉండటమే కాకుండా, పశువులు, ప్రజలు ప్రమాదవశాత్తు గోతు ల్లో పడి మృతి చెందిన సంఘటనలు కొన్ని వున్నాయి. ఎండాకాలంలో గోతుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల నీరు తాగటానికి వెళ్లిన మూగ జీవాలు గోతుల్లో పడి మృతిచెందే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్రమంగా వేల ట్రిప్పుల చెరువు మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా బట్టీలకు తరలిస్తున్న సంబంధిత శాఖల అధికారుల జాడే లేదని రైతులు, ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని బట్టీలపై తగిన చర్యలు తీసు కోవాలని, అక్రమ చెరువు మట్టి తరలింపును ఆపి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**తహసీల్దార్ వివరణ...**

పై విషయమై టేక్మాల్ తహసీల్దార్ తులసీరాంను వివరణ కోరగా అనుమతులులేకుండా చెరువు కుంటల్లో తవ్వకాలు జరిపితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాల్టా చట్టాన్ని తూట్లు పొడిచే విధంగా అక్రమార్కులు వ్యవహరిస్తే అందుకు సంబంధించిన ఇటుక బట్టీల యజమానులపై, అందుకు సహకరిస్తున్న వాహనపుదారుల మీద కేసులతో కూడిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఈ విషయంపై వెంటనే విచారణ జరుపుతామని ఆయన అన్నారు.



అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న దృశ్యం



చెరువులోంచి అక్రమంగా తీసుకొచ్చిన మట్టి కుప్పలు

## రేజింతల్ ఉపసర్పంచ్‌కు సన్మానం



ఉపసర్పంచిని సన్మానిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
సదాశివపేట మండలంలోని రేజింతల్ గ్రామపంచాయతీ ఎన్నికలలో ఉప సర్పంచ్‌గా విజయంసాధించిన ముక్కగళ్ళ అశోక్‌ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు శ్రావణ్‌కుమార్ అలాగే చత్రపతి యువసేన నాయకులు నర్సింలు, స్మామాట్ గోవర్ధన్, సివిల్ సప్లై విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సంగారెడ్డి జిల్లా డైరెక్టర్ పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులు పాటించండి అధిక దిగుబడులు పొందండి

**-పంటలను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి**



శనగపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అవినాష్‌వర్మ

**న్యాల్‌కల్, జనవరి 6, ప్రభాతవార్త:**
పంటలను (శనగ, కుసుమ, జొన్న) సాగుచేసుకుంటున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు అందుకోవాలని మండల వ్యవసాయ అధికారి అవినాష్‌వర్మ సూచించారు. మండల పరిధిలోని చాల్కి రైతువేదికలో చాల్కి, హుస్సేన్‌నగర్ క్లస్టర్ రైతులతో ప్రత్యేకంగా సమావేశం అయి పంటలసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎండ తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి మందును రైతులకు అందించి వాడుకునే తీరుపై వివరించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసుకుంటున్న శనగ, కుసుమ క్షేత్రాలను సందర్శించి రైతులకు యాజమాన్య పద్ధతులు సూచించారు. కార్యక్రమంలో ఎఈఓ సాయికిరణ్‌రెడ్డి, నగేష్, చాల్కి సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఖయ్యాం, హుమ్నాపూర్ సర్పంచ్ చందు, రైతులు మున్ను పటేల్, రాజేష్, రాజన్నపాటేల్, రియాజ్‌పటేల్, గుణవంత్‌పటేల్, శ్రీకాంత్, రాజు. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిపల్లి బస్‌స్టాప్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని ఆరోగ్య కేంద్రం సిబ్బంది వినతి



నూతన సర్పంచ్ పద్మావతి అశోక్‌గౌడ్‌ను సన్మానంచేస్తున్న దృశ్యం

**నర్సాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
రెడ్డిపల్లి బస్‌స్టాప్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపడంలేదని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బస్సులు ఆపేవిధంగా చూడాలని రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్‌గౌడ్‌కు మంగళవారం రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వినతిపత్రం అందజేశారు. అనంతరం రెడ్డిపల్లి గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన పద్మావతి అశోక్‌గౌడ్‌ను ఆరోగ్యకేంద్రం సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అధికారులు దృష్టికి తీసుకువెళ్లి బస్సులు ఈ బస్‌స్టాప్ వద్ద ఆపేవిధంగా చూడాలని సర్పంచ్‌ను ఆరోగ్యకేంద్రం సిబ్బంది కోరారు. అదేవిధంగా నర్సాపూర్ పిఏసిఎస్ బ్యాంక్ సెక్రటరీ వెంకటస్వామి నూతన సర్పంచ్ పద్మావతి అశోక్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘువరన్, వసంత, బేగం, సిబ్బంది చందు, వెంకటేష్, దేవి, నికిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నర్సరీ పనులు వేగవంతం చేయాలి



జగదేవ్‌పూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడివో శ్రీనివాస్‌వర్మ

**జగదేవ్‌పూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
ప్రతి గ్రామంలో మొక్కలు పెంచేందుకు నర్సరీ ఏర్పాట్ల పనులు వేగవంతం చేయాలని ఎంపిడివో శ్రీనివాస్‌వర్మ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జగదేవ్‌పూర్, గొల్లపల్లి నర్సరీలను సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హరితహారంలో భాగంగా వచ్చే సంవత్సరానికి మొక్కలునాటేందుకు గ్రామాల్లో మొక్కలపెంపకానికి నర్సరీలను సిద్ధంచేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య వాతావరణం నెలకొనేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాంరెడ్డి, వెంకటేష్, కంప్యూటర్ ఆపరేటర్ మల్లారెడ్డి, ఈజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నంగునూరి సత్యనారాయణకు సన్మానం



నంగునూరి సత్యనారాయణను సన్మానిస్తున్న దేశబోయిని నర్సింహులు

**గజ్వేల్ టౌన్, జనవరి 6, ప్రభాతవార్త:**
గజ్వేల్ మాజీ ఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ ఇటీవల కొమురవెల్లి ఆలయ డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా వారిని బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు యువజన ప్రతినిధులతోకలిసి సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గజ్వేల్ ఉపసర్పంచ్‌గా, కౌన్సిలర్‌గా పనిచేయడంతోపాటు సామాజిక, ధార్మికసేవలో ముందువరుసలో ఉండే నంగునూరి సత్యనారాయణ కొమురవెల్లి ఆలయ డైరెక్టర్‌గా నియామకమవ్వడం గజ్వేల్‌కు గర్వకారణమన్నారు. వారు రాబోవు రోజుల్లో మహోన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజననాయకులు ఇంద్రాగౌడ్, సాదుల్ తదితరులు పాల్గొన్నారు.

# నవోదయలో ఘనంగా యువ పార్లమెంట్ పోటీలు

**-ఆకట్టుకున్న విద్యార్థులు ప్రదర్శనలు**
**-విద్యార్థులను అభినందించిన మెదక్ ఎంపి రఘునందన్‌రావు**



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

**వర్గల్, జనవరి 6, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం యువ పార్లమెంట్ పోటీలను ఘనంగా నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు, గౌరవ అతిథిగా నవోదయ విద్యాలయ సమితి ప్రాంతీయ కార్యాలయం సహాయ సంచాలకులు చక్రపాణితోపాటు నవోదయ విద్యాలయ సమితి భోపాల్ రీజియన్ ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకులు దేవేందర్‌కుమార్, భారతప్రభుత్వ పార్లమెంటరీ మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గుజరాత్ రాష్ట్రం వాల్సాట్ నవోదయ విద్యాలయ, కేరళ రాష్ట్రం కొల్లం నవోదయ టీం పాల్గొనగా సుమారు 55 నిమిషాల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో అన్ని అంశాలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. యువ పార్లమెంట్ సభ్యులు తమచర్చల్లో విద్యావిధానంపై, రైల్వే దుర్ఘటనలపై, లోక్‌సభ, అసెంబ్లీకి జరిగే జమిలి ఎన్నికలపై ప్రశ్నోత్తరాల్లో ప్రస్తావించారు. అదేవిధంగా జీరో అవర్లో పర్యావరణ సమస్యలపై, నీటి కాలుష్యంపై ప్రస్తావన జరిగింది. విద్యాబిల్లుపై సమగ్రంగా చర్చ జరిగి సభలో ఆమోదింపబడింది. జవహర్ నవోదయ విద్యాలయ కొల్లం టీం తమప్రదర్శనలో ఇటీవల మరణించిన మాజీప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌పై సంతాపతీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా పరీక్షా విధానాలపై, భారతదేశ విదేశాంగ విధానంపై, రైతులసమస్యలపై సమగ్రంగా ప్రశ్నలు, వివరణలు జరిగాయి. జీరో అవర్‌లో విదేశాల్లో చదువుతున్న భారతీయవిద్యార్థుల అవస్థగురించి ప్రస్తావించారు. అలాగే మహిళారిజర్వేషన్ బిల్లుపై విస్తారంగా చర్చ జరిగి సభలో ఆమోదించబడింది. రెండుజట్లనుండి 8మంది చొప్పున ఉత్తమప్రతిభ ప్రదర్శించిన విద్యార్థినీవిద్యార్థులను ఎంపిక చేయడమైనది. మెదక్ ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ తప్పకుండా ఏదో ఒకరోజు నిజజీవితంలో కూడా ఈ యువ పార్లమెంట్ సభ్యులు ప్రజాప్రతినిధులు కావాలని ఆకాంక్షించారు. జవహర్ నవోదయ విద్యాలయలో సంపూర్ణ వికాసానికై ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. జాతీయస్థాయికి ఎంపికకాబోయే జట్టుకు ఆయన తన అభినందనలు ముందుగానే తెలియజేశారు. అదేవిధంగా సహాయ సంచాలకులు దేవేందర్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ఇరుజట్ల ప్రదర్శన అత్యుత్తమంగా ఉందని చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇరుజట్లకు కొన్నిసూచనలు చేశారు. పార్లమెంటరీ విధానము ఏవిధంగా ఉంటుందో నిజమైన లోక్‌సభ, రాజ్యసభలో చర్చలు ఏవిధంగా ఉంటాయో క్షుణ్ణంగా వ్యవహరిస్తూ చిన్నచిన్న పొరపాట్లను సరిదిద్దారు. కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, విద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతరసిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీచేసిన వ్యవసాయ అధికారులు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

**నర్సాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి దీపికలు తనిఖీ చేశారు. అనంతరం ఎరువుల దుకాణాల్లో యూరియా నిల్వ, అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో రైతులకు సరిపడు యూరియా అందుబాటులో ఉందని రైతులు తమ పట్టాదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు తీసుకొనివచ్చి యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు. ఎకరానికి మూడు బ్యాగుల చొప్పున యూరియా విక్రయాలు జరపాలని డీలర్లను ఆదేశించారు. అయితే చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్‌గౌడ్ నాటువేసేందుకు సాగుచేస్తున్న పదిహేను ఎకరాల పొలానికి కావలసిన 45బస్తాల యూరియా కొనుగోలు చేసి సాగుకు సిద్ధంగా ఉన్నానని అధికారులకు తెలియజేశారు.

## పేట మున్సిపల్ ఎన్నికలపై బిజెపి కార్యాచరణ



సదాశివపేటలో బిజెపి నాయకుల సమావేశం

**సదాశివపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
బిజెపి సదాశివపేట పట్టణశాఖ కార్యాలయంలో రాబోయే మున్సిపల్ ఎలక్షన్స్ గురించి కార్యచరణ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో స్థానిక వార్డుల వారీగా ఎన్నికల్లో నిలబడేవారి పేర్లను సేకరించడం జరిగింది. ప్రతి వార్డులో బలమైన నాయకుడిని నిలపెట్టి గెలిపించాలని, అలాగే మునిసిపల్ ఆఫీస్‌పై జెండా ఎగురవేయాలి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఒడెల మాణిక్‌రావు, మెదక్ పార్లమెంటు కన్వీనర్ కోవూరి సంగమేశ్వర్, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంయాదవ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, కావాలి అనిత, ఉపాధ్యక్షులు కూచిని సతీష్, మాజీకౌన్సిలర్ పురాన్‌సింగ్, పట్టణ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శివలింగం, పట్లూరు సంగమేశ్వర్, జగదీశ్వర్, సాంబశివ, అశోక్ స్వామి, కృష్ణగౌడ్, ధారా రాజేష్, విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి రాష్ట్ర మహిళాకన్వీనర్‌గా పుల్ల కళ్యాణి

**గజ్వేల్ టౌన్, జనవరి 6, ప్రభాతవార్త:**
శంషాబాద్‌లో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబివిపి) 44వ రాష్ట్ర మహాసభలలో గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన పుల్ల కళ్యాణియాదవ్‌ను రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, విద్యార్థులకు ఎక్కడ సమస్యలు ఎదురైనా ముందుండి పరిష్కరిస్తామని స్పష్టంచేశారు.

## అన్నిరంగాలకు మూలధారం గణితశాస్త్రం

**-మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి**



ముఖ్యఅతిథులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

**గజ్వేల్ టౌన్, జనవరి 6, ప్రభాతవార్త:**
అన్నిరంగాలకు మూలధారం గణితశాస్త్రమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి అన్నారు. గజ్వేల్‌లో మంగళవారం టిఎంఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణరాష్ట్ర 33జిల్లాల గణితంపోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా టిఆర్‌టియు అధికార ప్రతినిధి వంగా మహేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సి.సంతోష్‌లు పాల్గొని మాట్లాడారు. స్వర్గీయ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గత 15రోజుల నుండి పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో జరుగుతున్నటువంటి గణిత పోటీపరీక్షల్లో ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్, గురుకుల పాఠశాలలకు సంబంధించిన ఉత్తమప్రతిభ కనబర్చిన ముగ్గురు ఉత్తమ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమాన్ని గజ్వేల్‌లో నిర్వహించిందుకు టిఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా బాధ్యులు సుభాష్‌రెడ్డి, రాష్ట్రసభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

## చలికాలంలో ఎముకలు, కీళ్ల నొప్పులకు ఎక్కువ జాగ్రత్తలు పాటించాలి

**-ఎముకల, కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ ఉపేందర్ సాతెల్లి**

**నారాయణఖేడ్, జనవరి 6, ప్రభాతవార్త:**
చలికాలంలో చాలామందిలో ఎముకలు, కీళ్లనొప్పులు ఎక్కువగా బాధిస్తాయని ఎముకల, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ ఉపేందర్ సాతెల్లి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా మోకాళ్లు, నడుము, మెడ, భుజాలనొప్పులు వృద్ధులతోపాటు యువతలోకూడా పెరుగుతు న్నాయని ఆయన పేర్కొన్నారు. చలికాలంలో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొన్నిజాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. నొప్పుల పేరుతో ఇష్టానుసారంగా మందులువాడటంవల్ల సమస్య మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. సమయానికి వైద్యసలహా తీసుకుంటే ఎముకల, కీళ్ల సమస్యలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు.

# నల్లకుంట చెరువు కాలుష్యంపై పోరాటం ఆగదు

**-కాలుష్యం వ్యతిరేక పోరాట కమిటీ**



నల్లకుంట చెరువు వద్ద మాట్లాడుతున్న దృశ్యం

**గుమ్మడిదల, జనవరి 6, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు నల్లకుంటచెరువు వద్ద మంగళవారం కాలుష్యం వ్యతిరేకపోరాట కమిటీ ఆధ్వర్యంలో పత్రికావిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీసభ్యులు మాట్లాడుతూ నల్లకుంట చెరువులో జరుగుతున్న కాలుష్యం కారణంగా స్థానిక ప్రజల జీవనవిధానం తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తంచేశారు. జిల్లా కలెక్టర్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశాలను వారు మీడియాకు చూపించారు.

2012లో సేకరించిన నమూనాల్లో చెరువు నీరు పింక్ రంగులోకి మారినట్టు, అధికంగా ప్రమాదకర రసాయనాలు ఉన్నట్టు ఎపిపిసిబి నిర్ధారించిందని తెలిపారు. కాలుష్యానికి కారణమైన హెటిరో యూనిట్-1 పరిశ్రమనే చెరువును శుభ్రంచేసి, కలుషితనీటిని పరిశ్రమలోకి తరలించి శుద్ధి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని గుర్తుచేశారు. కలెక్టర్ జోక్యంతో పూర్తిస్థాయి క్లీన్‌అప్ చేపట్టారని, ఈ నీరు వ్యవసాయానికి పనికిరాదని అధికారులు స్పష్టంచేసిన విషయాన్ని గుర్తుచేశారు. మానవ హక్కుల కమిషన్ పిసిబి ఆదేశాల అమలును తప్పనిసరిచేస్తూ గతంలో తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈసమావేశంలో టిపిజెఎసి జిల్లా కన్వీనర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గతంలో నల్లకుంట చెరువునీరు గులాబీ రంగులోకి మారిన ఘటనపై కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) అధికారులు స్పష్టమైన నిర్ధారణ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం హెటిరో యాజమాన్యం తమ పరిశ్రమల కాలుష్యంవల్ల కాకుండా పర్పుల్‌సల్ఫర్ బ్యాక్టీరియా కారణంగానే చెరువునీరు గులాబీరంగులోకి మారిందని చెబుతూ బాధ్యత నుంచి తప్పించుకోవడం సరైనవిధానంకాదని తీవ్రంగావిమర్శించారు. పిసిబి నివేదికలు స్పష్టంగా ఉన్నప్పటికీ, పరిశ్రమ యాజమాన్యం ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తోందని కమిటీసభ్యులు ఆరోపించారు. కాలుష్యం వల్ల చెరువులోని నీరు మాత్రమే కాకుండా భూగర్భ జలాలు, వ్యవసాయ భూములు, ప్రజల ఆరోగ్యం తీవ్రప్రమాదంలో పడుతున్నాయని తెలిపారు. ఈప్రాంత ప్రజలు అనేకరకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనుగడకు ప్రమాదకరంగా మారిన కాలుష్య పరిశ్రమలను వెంటనే మూసివేయాలని వారు డిమాండ్‌చేశారు. పరిశ్రమలవల్ల జరుగుతున్న కాలుష్యంపై సమగ్రవిచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాలుష్యపరిశ్రమలు మూసివేసేవరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కాలుష్యం వ్యతిరేకపోరాట కమిటీ నాయకులు, స్థానిక ప్రజలు, పర్యావరణ కార్యకర్తలు పాల్గొని నల్లకుంట చెరువును కాపాడేందుకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మంగయ్య, స్వేచ్ఛరెడ్డి, బాలుగౌడ్, యాదగిరి, సతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, యంజల యాదిగిరి, ఆనంద్‌రెడ్డి, శంకరయ్య, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కూరగాయల పెట్టెల పంపిణీ

**గుమ్మడిదల, జనవరి 6, ప్రభాతవార్త:**
నల్లవల్లి గ్రామంలో ఉద్యానశాఖ హెచ్‌ఓ అనూషరెడ్డి ఆధ్వర్యంలో, గ్రామసర్పంచ్ కోరివి రాణిసురేష్ చేతుల మీదుగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన-వర్షాధారిత పంటల అభివృద్ధిపథకం కింద రైతులకు కూరగాయల పెట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు సర్పంచ్ మాట్లాడుతూ, వర్షాధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతులకు అదనపు ఆదాయం కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో గ్రామ పాలకవర్గం ఉద్యానశాఖ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. రైతులు ఈపథకంపట్ల సంతోషం వ్యక్తంచేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల పోచయ్య, వార్డు సభ్యులు కుమ్మరి ఆంజనేయులు, కమ్మరి రాము, రాగుల నర్సింలు, మంజుల అశోక్‌గౌడ్, రజని జితేందర్, మాజీ సర్పంచులు, మాజి ఎంపిటిసిలు, గ్రామపెద్దలు, రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పాడిగేదెలకు గర్భకోశవ్యాధి నివారణ చికిత్సలు

**వెల్దుర్తి, జనవరి 6. ప్రభాతవార్త:**
మండలం రామయపల్లి గ్రామంలో మంగళవారం నాడు పశువర్ధక శాఖ వెల్దుర్తి వారి ఆధ్వర్యంలో పాడిగేదెలకు గర్భకోశవ్యాధి నివారణ చికిత్సలుచేయడం జరుగుతుందని పశువైద్యాధికారి రేఖరసజ్ఞ అన్నారు. ఇందులోభాగంగా 48 పాడిగేదెలకు చికిత్సలు, 22 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగిందని ఆమె తెలిపారు. గ్రామాల్లోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ శిబిరంలో గ్రామసర్పంచ్ నరేందర్‌రెడ్డి, డిఐడిఏ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రభాకర్, మండలం పశువైద్యాధికారి డాక్టర్ రేఖరసజ్ఞ, రమేష్, వెంకట్, నవీన్, భాస్కర్, పాడిరైతులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరెల పంపిణీ..

**నారాయణఖేడ్, జనవరి 6, ప్రభాతవార్త:**
మాధవార్ తండా గ్రామపంచాయతీలోని మాధవార్ తాండ, గునుకుల కుంట గ్రామాలలో ఈరోజు ఇందిరా మహిళాశక్తి చీరెలపంపిణీ కార్యక్రమం గ్రామసర్పంచ్ వి.సర్దార్, ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, వార్డ్‌సభ్యుల సమక్షంలో జరిగింది. కార్యక్రమంలో రెండు గ్రామాలకు సంబంధించిన పెద్దలు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**నారాయణఖేడ్, జనవరి 6, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలువురు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందినందున వారి వైద్యఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను నారాయణఖేడ్ మండలం పలుగుతాండకు చెందిన కర్ర లక్ష్మీబాయి, చాప్టతండకు చెందిన జాదవ్ సంకిబాయి, కుబతాండకు చెందిన జాదవ్‌లక్ష్మీబాయి, నిజాంపేట్ మండలం రామ్‌రెడ్డిపేట్ గ్రామానికి చెందిన నీరుడి పాపయ్య, రామ్‌రెడ్డిపేట్ గ్రామానికి చెందిన దుర్గయ్య, శంకరంపేట్(ఆ) మండలంలోని భవాని గణేష్, బుజిరంపల్లిగ్రామానికి చెందిన నీరుడు శంకరయ్య, విరోజీపల్లిగ్రామానికి చెందిన సిర్గాపురం సాయిలు, విరోజీపల్లి గ్రామానికి చెందిన సిర్గాపురం స్వప్నలకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేసారు. వారితో పాటు మండల మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామసర్పంచులు, ఉప సర్పంచుల్లు, వార్డుసభ్యులు, బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు ఉన్నారు.

## చౌటకూర్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి

**-సర్పంచ్ పార్కుల రాంరెడ్డి**



చౌటకూర్‌లో ఐమాక్స్ లైట్లను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాంరెడ్డి

**చౌటకూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూర్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నానని సర్పంచ్ పార్కుల రాంరెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం అంబేద్కర్ ప్రధాన కూడలి వద్ద హైమాస్ లైట్ ఏర్పాటుచేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఎలాంటి నిధులు అందుబాటులో లేకపోయినప్పటికీ, సొంతంగా నాలుగు బోర్లు తవ్వించానని, 9 హైమాస్ లైట్లను ఏర్పాటుచేశానని తెలిపారు. విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు జిల్లాపరిషత్, ప్రాథమిక పాఠశాల, శ్మశానవాటిక, 11వవార్డులో బోర్లు తవ్వించడం జరిగిందన్నారు. దీంతోపాటు రూ.9లక్షలు వెచ్చించి, 9ప్రధాన వీదుల్లో హైమాస్ లైట్లను అమర్చానని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కలాలి రామాగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు వర్కల రమేశ్, నాయకులు పల్నాటి మల్లికార్జున్‌గౌడ్, పార్కల ప్రభాకర్రెడ్డి, కొల్కూరి మొగులయ్య, పల్లె రాజాగౌడ్, పార్కల నరేందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైనపేదలు ప్రభుత్వపథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**-అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య**

**అత్తాపూర్, జనవరి 5, ప్రభాతవార్త:**
అర్హులైన నిరుపేదలు ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలని అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఒక్రపకటనలో మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రభుత్వం ముస్లిం మైనార్టీల కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఇందిర మైనార్టీ మహిళ యోజన, రేవంత్ అన్నా క సహారా మిస్కినో కె లియే పథకాలలో భాగంగా రెండవవిడత దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామని ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని కావున అత్తాపూర్ పరిధిలోని మైనారిటీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఈవిఎం గోడౌను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**అత్తాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
ఈవిఎం గోదాంపై ఎప్పటికప్పుడు అధికారులు నిఘా ఉంచాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఈవిఎం గోదాంను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, తహసీల్దార్ బొమ్మల రాములుతో కలిసి తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి, వాటిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవిఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఈవిఎంలు భద్రపరిచిన గోడౌన్‌కు సీల్‌వేయించారు. కార్యక్రమంలో అధికారులు, వివిధపార్టీల నేతలు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడివో రమేష్

## తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి : ఎంపిడివో

**హుస్నాబాద్ రూరల్, జనవరి 6, ప్రభాతవార్త :** ప్రజలు ఇళ్లల్లోనే తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలని మండల ప్రజాపరిషత్ అధికారి ఆర్.రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో హుస్నాబాద్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల సిబ్బందికి సాహసచంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహస స్వచ్ఛంద సేవా సంస్థ గ్రామాల అభివృద్ధికి పనిచేస్తోందన్నారు. అనంతరం సంస్థ తరుపున గ్రామపంచాయతీ సిబ్బందికి బూట్లతో పాటు బ్లౌసేస్, జాకెట్‌లు, మాస్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ ఆఫీసర్ మోహన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఇటికాల చిన్న, ఫీల్డ్ సూపర్‌వైజర్లు బాలరాజు, వేల్పుల సంపత్, సిద్దగోని శ్రావణి, లింగాల వినీత్ ఉన్నారు.

## ఎన్నికల ఖర్చుల వివరాలు అందజేయాలి : ఎంపిడివో


మాట్లాడుతున్న ఎంపిడివో వీరరాజు

**ధూళిమిట్ట, జనవరి 6, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను సేకరించి అందజేయాలని ఎంపిడిఓ వీరరాజు కోరారు. మంగళవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీలు పెంచడం, ఇంటి పన్ను వసూలు, గ్రామ పంచాయతీ యందు రోజు ఉపాధి హామీ పని కింద 30 మంది వేజ్ సీకర్ లను డిమాండ్ చేయడం, సిటిజన్ సర్వీసెస్ వంటి తదితర అంశాల పై పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ లకు తగు సూచనలు చేశారు. పనులన్నీ జరిగేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీవో మాధవ్ జాదవ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లు, టెక్నికల్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## అధిక యూరియా వినియోగం పంటలకు తీవ్ర నష్టం

### -జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న స్వరూపరాణి

**మర్కుక్, జనవరి 6(ప్రభాతవార్త):** అధికంగా యూరియా వినియోగించడం వల్ల పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండలంలోని గణేష్‌పల్లిలోగల హాకా సెంటర్‌ను, ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సెంటర్‌లో ఉన్న యూరియా నిల్వలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎర్రవల్లి రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అధిక యూరియా వాడకంతో నేల సారంపై పడే ప్రతికూల ప్రభావాలను రైతులకు వివరించారు. సమతుల్య ఎరువుల వినియోగంతోనే మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి సకాలంలో అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బోయినపల్లి రాము, ఏఈవోలు విష్ణు, మునిరబేగం, రైతులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కవితకు సన్మానం


సర్పంచ్ కవితను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు

**మర్కుక్, జనవరి 6 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కర్కపట్ల గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేసి గ్రామ ప్రజలకు సేవలందించిన గోండ్ల కవిత ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మర్కుక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప, డాక్టర్ మహతి, ప్రవితలు మాట్లాడుతూ కర్కపట్ల గ్రామంలో 20 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తగా సేవలందించి ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన కవిత సర్పంచ్ కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ సుధాకర్, హెచ్‌ఈవో వెంకటరమణ, స్టాఫ్ నర్స్ గీత, మైత్రి, ఎల్‌టి నర్సింహులు, ఏఎన్‌ఎంలు సువర్ణ, చంద్రకళ, బిపాషా, విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు పొట్టోల్ల భాగ్య, రాణి, మహేశ్వరి, లక్ష్మి, లత, ధనలక్ష్మి, భారతి, హరిత, నవనీత, స్వప్న, లక్ష్మీబాయి, సునీత, కవిత పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి : సర్పంచ్

**కొండపాక, జనవరి 6, ప్రభాతవార్త :** గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు అరోగ్యంగా ఉంటారని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కన్నెమైన సంపత్ అన్నారు. మంగళవారం బోబ్బాయిపల్లి అంజనేయస్వామి దేవాలయంలో మొక్కులు తీర్చుకొని అనంతరం మధిర రామునిపల్లిలో గత కొంత కాలంగా మురికి కాలువల్లో పెరుకుపోయిన చెత్తచెదారాన్ని జెసిబితో శుభ్రం చేయించారు. గ్రామం నుండి కుకునూరుపలనఇల గ్రామానికి వెళ్ళే రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన ఉప సర్పంచ్ రాజుతో కలిసి మాట్లాడారు. చెత్త చెదారాన్ని కాలువల్లో వెయవద్దని అయన గ్రామస్తులను కోరారు. చెత్తను వేరుచేసి పంచాయతి ట్రాక్టర్‌కు ఇవ్వలని సూచించారు. చెత్త చెదారం నిల్వ ఉండడంవల్ల అంటురోగాలు వచ్చే అవకాశాలుంటాయన్నారు. అందరు సహకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని కోరారు. కార్యక్రమంలో కొల రవీందర్, కన్నెమైన నర్సింలు, రాజు, శ్రీనివాస్, పాల్గొన్నారు.


రామునిపల్లిలో మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

# సైన్స్‌ఫెయిర్ విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 6 ప్రభాతవార్త:** ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య అధికారులకు సూచించారు. మంగళవారం జూమ్ ద్వారా ఎస్‌ఐఎస్‌ఎఫ్-2026 నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సైన్స్‌ఫెయిర్ ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించి, ఆయా శాఖల అధికారులకు స్పష్టమైన విధులు, బాధ్యతలను అప్పగించారు. సైన్స్‌ఫెయిర్ సంగారెడ్డి జిల్లా, ఆర్‌సిపురం మండలం, కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జనవరి 19 నుంచి 23 వరకు జరగనున్నట్లు తెలిపారు. ఇది దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనే ప్రతిష్ఠాత్మక సైన్స్ ఫెయిర్ కావడంతో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. సైన్స్‌ఫెయిర్ నిర్వహణలో భాగంగా అదనపు కలెక్టర్ సమన్వయ బాధ్యతలు నిర్వహించనుండగా, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నారు. డీఎంహెచ్‌ఓ వైద్య, ఆరోగ్య సదుపాయాలు, అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటుచేయాలని, డీఈఓ సైన్స్ ఫెయిర్‌కు సంబంధించిన సంబంధిత అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. డీటీఓ బడ్జెట్ అంశాలను, జిల్లా రవాణా అధికారి విద్యార్థులు, అతిథుల రాకపోకలకు రవాణా సౌకర్యానికి ఏర్పాట్లు చేయాలని, డీపీఆర్‌ఓ మీడియాతో సమన్వయం చేసుకోవాలని, జిల్లా ఫైర్ ఆఫీసర్ అగ్నిమాపక భద్రత చర్యలకు తగిన చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరా, పారిశుధ్య ఏర్పాట్లను జిహెచ్‌ఎంసి(తెల్లాపూర్ డివిజన్), టీఎస్పీడీసీఎల్ నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, వేదిక, కుర్చీలు తదితర మౌలిక వసతులు ఆర్ అండ్ బి శాఖ ఏర్పాటు చేయాలని చెప్పారు. టీషర్టు, క్యాప్స్, నోట్‌బుక్స్ వంటి సామగ్రి జిఎండిఐసి అందించడానికి చర్యలు తీసుకోవాలని ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ ఎన్‌సిసి విద్యార్థుల సమన్వయాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు తమకు అప్పగించిన విధులను గడువులోగా పూర్తి చేసి, సైన్స్‌ఫెయిర్‌ను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ పాండు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావిణ్య


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంద పవన్

## మున్సిపాలిటీలో 35 వార్డులుగా విభజించాలి

**గజ్వేల్, జనవరి 6 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 20 వార్డులను మున్సిపాలిటీ ప్రజల విజ్ఞప్తి మేరకు 35 వార్డులుగా విభజించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జెర్రిపోతుల జనార్దన్‌తో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో 45వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు కానీ, కేవలం 20 వార్డులే ఉండడం వల్ల ఆ వార్డులు అభివృద్ధికి నోచుకోలేదని, పాలన పరంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందన్నారు. ఒక్కో వార్డులో 2500 ఓట్ల వరకు ఉన్నాయని, పోటీచేసే అభ్యర్థులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో 35 వార్డుల వరకు విభజించి ప్రజల కోరికను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మున్సిపల్ పరిధిలో ఓట్లను సరిచేయడంలో కూడా పొరపాట్లు జరిగాయని, చనిపోయిన వారి పేర్లు ఇంకా తొలగించలేదని, డబుల్ ఓట్లను తొలగించి తప్పులు లేకుండా చూడాలని కోరారు.

## పేదలను ఆదుకోవడానికే సిఎం సహాయనిధి

**కొండపాక, జనవరి 6, ప్రభాతవార్త :** కార్పొరేట్ అసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నవారిని ఆర్థికంగా ఆదుకోవడానికి సిఎం సహయనిధి ఉపయోగపడుతుందని సర్పంచ్ శిల్పనర్సింలు, రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. మంగళవారం లకుడారంలో చిరబోయిన నాగమణికి రూ॥ 45 వేల, నాగపూరి లక్ష్మికి రూ॥ 25 వేల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలను అదుకోవడానికి సిఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డ, వార్డు సభ్యులు గట్టు చంద్రం, దేవి నర్సింలు, కళా కర్ణాకర్, వంకని రాజు, నాయకులు రాచకొండ భిక్షపతి, ఎండి మొహినుద్దీన్, అన్నెమైన నర్సింలు, కంకనాల బిక్షపతి, కంకనాల నర్సింలు పాల్గొన్నారు.

## మున్సిపల్‌లో వార్డులను పెంచి ఎన్నికలు నిర్వహించాలి

### -బిఆర్ఎస్ నేత మర్రి స్వామి

**గజ్వేల్, జనవరి 6 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వార్డులను పెంచి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు మర్రి స్వామి, మల్లేశం, కాటు కళ్యాణ్, యాకుబ్, మహేష్ మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ విస్తరణ చాలా పెరిగిందని, గతంలో ఉన్న 20 వార్డులను ఆర్‌అండ్‌ఆర్ కాలనీతో కలిపి 33 వార్డులను చేయాలన్నారు. ప్రభుత్వం వార్డులను పెంచిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని, లేకపోతే ప్రస్తుతం ఉన్న 20 వార్డుల్లో అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. మున్సిపాలిటీలో వార్డులు పెంచేలా ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మర్రి స్వామి


సర్పంచ్ లక్ష్మికొండయ్యను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

## నేటి బాలలే రేపటి పౌరులు : సర్పంచ్

**గజ్వేల్, జనవరి 6 (ప్రభాతవార్త):** నేటి బాలలే రేపటి పౌరులు అని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాన్ని సంపాదించాలని గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామ సర్పంచ్ లక్ష్మి కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం కొడకండ్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో వంద శాతం హాజరు సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మికొండయ్య మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం హాజరు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం లక్ష్మికొండయ్యను ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, విఓ చైర్మన్ కళ్యాణి, ఉపాధ్యాయులు రహేళ్ల, కల్పన, సాధన, సాయిప్రియ, అంగన్వాడీ టీచర్ రమ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండల కమిటీలను రద్దు చేసే హక్కు ఎవరికీలేదు

### -వీరశైవ లింగ బలిజ గజ్వేల్ అధ్యక్షుడు కాసం వీరేశం

**గజ్వేల్, జనవరి 6 (ప్రభాతవార్త):** వీరశైవ లింగ బలిజ సిద్దిపేట జిల్లా కమిటీలో వ్యక్తిగత విభేదాల కారణంగా మండల కమిటీలను రద్దు చేస్తున్నట్లు కొందరు వ్యక్తులు పత్రికల్లో వార్తలు ఇచ్చారని, మండల కమిటీలను రద్దు చేసే హక్కు ఎవరికి లేదని వీరశైవ లింగ బలిజ గజ్వేల్ మండల అధ్యక్షుడు కాసం వీరేశం తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని అన్ని మండలాల్లో వీరశైవ లింగ బలిజ కమిటీలను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేయడం జరిగిందని, కొందరు వ్యక్తుల మధ్య వచ్చిన మనస్పర్ధల కారణంగా పలు మండలాల్లో ఎన్నుకున్న అధ్యక్షులను రద్దు చేస్తున్నట్లు పత్రికా ప్రకటన ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మెజార్టీ సభ్యుల కోరిక మేరకు కమిటీలు రద్దుచేస్తారు తప్ప, వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. జిల్లా కమిటీలో వ్యక్తిగత విభేదాలు ఉంటే మాట్లాడుకోవాలి తప్ప సంఘం మీద రుద్దవద్దని సూచించారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. లేనిపోని ప్రకటనలు ఇచ్చి జిల్లా వీరశైవ లింగ బలిజ సంఘానికి అవమానం కలిగేలా చేయవద్దని అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి : సర్పంచ్

**కొండపాక, జనవరి 6, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరు ఇల్లు నిర్మించుకొని సొంతింటి కలనునెరవేర్చుకోవాలని సర్పంచ్ సోమి రేణుక భగవాన్ అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎంపిడివ రాంప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారులందరు ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇండ్లు నిర్మించుకున్నవారికి ఇప్పటికే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపిడిఓను సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి వాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైరి మల్లెశం, వార్డు సభ్యులు సోమి కర్ణాకర్, సంపత్‌చారి, రాజశేఖర్‌గౌడ్, శేఖర్, కార్యదర్శి రవి, నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఇందరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సర్పంచ్ సోమి రేణుకభగవాన్

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త :** రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అన్ని విధాలా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా రంజోల్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వసతి, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం బాగుందని ప్రశంసించారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ అఖిలేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినిలతో కలిసి భోజనం చేస్తున్న బక్కి వెంకటయ్య ఎమ్మెల్యే మాణిక్యరావు

## ఎస్సీ, ఎస్టీలపై దాడులను సహించం...

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త**

ఎస్సీ, ఎస్టీలపై దాడులను సహించమని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అన్నారు. కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో ఇటీవల బ్యాగరి రాములు ఇంటి కూల్చివేత ఘటనపై గత నెలలో బాధిత కుటుంబాన్ని కలిసి సంఘటనపై సమగ్ర విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం సజ్జాపూర్ గ్రామానికి విచ్చేసిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ బాధితుడు బ్యాగరి రాములుకు రూ.25,000 పరిహార చెక్కును అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా బక్కి వెంకయ్య మాట్లాడుతూ బాధితుడికి పరిహారం అందజేయడానికే తాను వచ్చానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై దాడుల విషయంలో పోలీస్ శాఖ నిరక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ శాసన సభ్యులు మాణిక్ రావు, ఆర్డీవో దేవుజా, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, ఎంపీడీవో, తహసిల్దార్ సుప్రియ, పోలీస్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### జిల్లా ఇన్‌చార్జి డిటివో లక్ష్మణ్

**సిద్దిపేట రూరల్, జనవరి 6,ప్రభాతవార్త :** నేటి బాలలే రేపటి పౌరులని... నేటి నుంచే పిల్లలకి రహదారి భద్రత నియమాలను నేర్పిస్తే భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా ఇన్‌చార్జి డిటివో లక్ష్మణ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణాశాఖ అధికారులు, ప్రైవేటు స్కూల్ యాజమాన్యం అసోసియేషన్ సభ్యుల సహకారంతో మంగళవారం పిల్లలకు రోడ్డు భద్రతపై క్విజ్‌పోటీలు, రహదారి భద్రత నియమాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్, వ్యాసరచన పోటీలకు పిల్లల నుంచి మంచి స్పందన వచ్చిందని విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజు బహుమతులు ప్రదానంచేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నారాయణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎంవిఐ శ్రీకాంత్‌రెడ్డి, ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ సభ్యులు ట్రెస్మా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షులు జె.మల్లారెడ్డి, టిపిఎస్‌ఎ అధ్యక్షులు భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, జనవరి 6, ప్రభాతవార్త :** ఈనెల 9వ తేదీన పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సురభి మెడికల్ కళాశాల మిట్టపెల్లి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు అనారోగ్య సమస్యలతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షలలో ఏదైనా చికిత్స అవసరమైతే అదే సురభి మెడికల్ కళాశాలలో ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బంక చందు, సింగిల్ విండో మాజీ చైర్మెన్ బొలిశెట్టి శివయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## మైనార్టీల సంక్షేమమే సిఎం రేవంత్‌రెడ్డి ధ్యేయం

### కాంగ్రెస్ మైనార్టీ నేత వహీద్‌ఖాన్

**సిద్దిపేట అర్బన్, జనవరి 6, ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు వహీద్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన వితంతువులు విడాకులు పొందిన మహిళలు, అవివాహిత మహిళలు తమ స్వంత వ్యాపారం చేసుకోవడానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఫకీర్ దూదేకుల వర్గాల జీవనోపాధి కోసం మోపేడ్ వాహనాల కొనుగోలు కోసం లక్ష రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతున్న సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## లబ్దిదారుడికి సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

**తొగుట, జనవరి 6, ప్రభాతవార్త :** మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు సహకారంతో మండల పరిధిలోని కానుగల్ గ్రామానికి చెందిన మరుపల్లి స్వామిగౌడ్‌కు రూ.27 వేల సిఎం సహాయ నిధి చెక్కు మంజూరు కావడంతో మంగళవారం బిజెపి నాయకులు లబ్దిదారునికి అందజేశారు. అనారోగ్యంతో కష్టకాలంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు లబ్దిదారుడు స్వామిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సహాయ సహకారాలు అందిస్తున్నారని బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు మోడీక స్వామియాదవ్ అన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా అధ్యక్షుడు మాదారం ప్రవీణ్, కానుగల్ బూత్ అధ్యక్షులు మాధవరెడ్డి గారి సుభాష్‌రెడ్డి, నాగార్జునగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, ప్రకాష్ పాల్గొన్నారు.

## చేబర్తిలో శ్రీరామరక్ష పుస్తకాల పంపిణీ

**మర్కుక్, జనవరి 6 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి గ్రామ హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ అధ్యక్షుడు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భద్రాచల దేవస్థానం నుండి వచ్చిన శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణ పుస్తకాలను, తలంబ్రాలను హనుమాన్ భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకం యాదగిరి, హనుమాన్ భక్త బృందం సభ్యులు రామరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్త బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధి గత ప్రభుత్వం పట్టించుకోలేదు

**సిద్దిపేట అర్బన్, జనవరి 6,ప్రభాతవార్త :** గత ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి పట్టించుకోలేదని ఆదివాసి గిరిజన కాంగ్రెస్ నాయకురాలు కెమ్మసారం శ్రీలత అన్నారు సంగారెడ్డిలో మూడు రోజుల పాటు నిర్వహించిన కాంగ్రెస్ ఆదివాసి గిరిజన శిక్షణ బిరంలో పాల్గొన్న అనంతరం మంగళవారం ఆమె సిద్దిపేటలో మాట్లాడుతూ కార్యకర్త సమ్మేళన్ శిక్షణ శిబిరంలో గిరిజనుల ఆదివాసులు సాధకారతకు వారి సంక్షేమానికి కృషి చేసేలా అవగాహన తరగతులు నిర్వహించారన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు అలాగే సంగారెడ్డి డిసిసి ఎస్టీ విభాగం వైస్ చైర్మన్ కెమ్మసారం ఎల్లయ్య స్పూర్తి మేరకు కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసి గిరిజన నాయకత్వ శిక్షణ శిబిరంలో రాష్ట్రంలో రెండో మహిళగా ఉమ్మడి జిల్లా నుంచి రెండవ మహిళగా శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య సంఘం అధ్యక్షులు కెమ్మసారం రాజేష్‌ఖన్నా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ సురక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ


**సిద్దిపేట అర్బన్, జనవరి 6, ప్రభాతవార్త :** చైల్డ్ సురక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలో వృద్దులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేనేజర్ వరకాల శశిధర్ మాట్లాడుతూ ఇటువంటి సహాయ కార్యక్రమాలు చేయడం దాతలకు తృప్తిని ఇస్తుందన్నారు. చలి తీవ్రత పెరగడం వలన దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని వృద్దులు చిన్న పిల్లలు చలికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ సందీప్, సూపర్‌వైజర్ అందె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు, జనవరి 6, ప్రభాతవార్త :** ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డును రెన్యూవల్ చేయించుకొని బెనిఫిట్‌లు పొందాలని భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు చెరుకు నారాయణ అన్నారు. మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు నానిబాబు మృతి చెందడంతో మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డు రెన్యువల్ చేసుకోవడం వలన ప్రభుత్వ బెనిఫిట్స్ వస్తాయన్నారు 2019 నుంచి 2026 వరకు మండలంలో 47 మంది భవన నిర్మాణ కార్మికులు చనిపోవడం జరిగిందన్నారు. లేబర్ కార్డు లేని ప్రతి కార్మికుడు కార్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు శంకరయ్య, లింగం, రాజు, నర్సయ్య, భూమయ్య, ఎల్లం, మెట్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

## పతంగులకు చైనా మాంజాను వాడొద్దు : సర్పంచ్

**కొండపాక, జనవరి 6, ప్రభాతవార్త :** మన అనందం కోసం మరొకరికి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకొవాలని సర్పంచ్ సిహెచ్ శిల్ప నర్సింలు సూచించారు. మంగళవారం లకుడారంలోని రెండు అంగన్‌వాడి కేంద్రాలతోపాటు ప్రాథమిక పాఠశాలను అమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పతంగులు ఎగురేసేవారు చైనా మాంజాను వాడకూడదన్నారు. మంజావల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, పండగపూట మన సంతోషం కోసం ఇతరులకు హాని తలపెట్టరాదని అమె సూచించారు. దాబాలపై, రోడ్లపై పతాంగులను చిన్న పిల్లలు ఎగురవేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లల కోసం వండిని అహార పదర్థాలను అమె పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవి నర్సింలు, వంకని రాజు, నాయకులు రాచకొండ భిక్షపతి, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ శిల్పనర్సింలు

